క్లుప్తంగా

నేడు రైతువేదికలో రుణమాఫీ సంబరాలు

నర్వ: ప్రభుత్వం చేపట్టిన రుణమాఫీ కార్యక్రమాన్ని గురువారం సాయంత్రం 3 గంటలకు స్థానిక రైతువేదికలో ప్రత్యేక్ష ప్రసారం ఉంటుందని ఏఓ గణేష్‌రెడ్డి తెలిపారు. సీఎం రేవంత్ లాంఛనంగా ప్రారంభించిన అనంతరం రైతులతో నేరుగా వీడియోకాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతారన్నారు. అనంతరం రుణమాఫీ లబ్ధి రైతులచే సంబరాలు జరుపుకోనున్నారన్నారు. కార్యక్రమంలో రైతులు, బ్యాంకు ప్రతినిధులు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరవుతున్నారు. రైతులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మద్దూరు: తెలంగాణ ప్రభుత్వం గురువారం లాంఛనంగా ప్రారంభించే రుణమాఫీ సంబరాలను లింగల్‌చేడ్‌లోని రైతు వేదికలో నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఏఓ రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి బ్యాంకుల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

మాగనూర్: రుణమాఫీ సంబరాలు స్థానిక రైతువేదికలో గురువారం నిర్వహించనున్నా వీడియో కాన్ఫరెన్స్‌లో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి హాజరవుతారని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. రైతువేదికలో జరిపే సంబరాల్లో ఎమ్మెల్యే పాల్గొంటారని తెలిపారు. రైతులు, మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

20న బీజేపీ జిల్లా కార్యవర్గ సమావేశం

నారాయణపేట రూరల్: బీజేపీ జిల్లా కార్యవర్గ సమావేశం ఈ నెల 20న నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు పీ. శ్రీనివాసులు, రఘురామయ్యగౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 10:30గంటలకు శ్యాసన్‌పల్లి రోడ్‌లోని లక్ష్మి బ్యాంకెట్ హాల్‌లో జరుగుతుందని, ముఖ్యఅతిథులుగా మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణతోపాటు రాష్ట్ర నాయకులు హాజరవుతున్నట్లు తెలిపారు. జిల్లా కార్యవర్గ సభ్యులతోపాటు మండల అధ్యక్ష, కార్యదర్శులు, మోర్చల ప్రతినిధులు విధిగా హాజరు కావాలన్నారు.

అధ్యాపక పోస్టులు మంజూరుపై హర్షం

నారాయణపేట: ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికా రెడ్డి కృషి వల్లే మెడికల్ కళాశాలకు ప్రభుత్వం 109 అధ్యాపక పోస్టులు మంజూరు చేయడంపై కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు, కౌన్సిలర్ ఎండీ సలీం బుధవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే రెండురోజుల క్రితం మెడికల్ కళాశాలకు పోస్టులు మంజూరు చేయాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టర్‌ను కోరినట్లు తెలిపారు. దీంతో ప్రభుత్వం వెంటనే స్పందించి కళాశాలకు 25 ప్రొఫెసర్, 28 అసోసియేట్ ప్రొఫెసర్, 56 సహాయక ప్రొఫెసర్ 109 పోస్టులను ప్రభుత్వం మంజూరు చేస్తూ జీఓ జారీ చేసిందని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో నియోజకవర్గం అన్ని రంగాల్లో మరింతగా అభివృద్ధి సాధించడం ఖాయమన్నారు.

పెద్దవాగుపై చెక్ డ్యాం నిర్మించండి



మాగనూర్: మండల కేంద్రంలోని పెద్దవాగుపై చెక్‌డ్యాం నిర్మించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. వేసవికాలం వచ్చిందంటే తాగునీటి సమస్య తీవ్రతరం చెందుతుందని దానికి ప్రత్యామ్నాయ వనరుగా ఎన్‌హెచ్-167పై ఉన్న వంతెనను చెక్ డ్యాంగా ఏర్పాటుచేయాలని గ్రామస్తుల ఆకాంక్ష. దీనికి తోడు బ్యాక్ వాటర్ ఆగడంతో ఆహ్లాదకరమైన వాతావరణం, గ్రామ సుందరీకరణలో భాగంగా అభివృద్ధి చెందుతుందని కోరుతున్నారు. అంతేకాకుండా ప్రస్తుత వర్షాకాలంలో వస్తున్న వరద నీరుతో బ్యాక్‌లో ఉన్న పంట పొలాలు పచ్చగా మారుతాయని కోరుతున్నారు. స్థానిక ఎమ్మెల్యే చెక్ డ్యాంలపై దృష్టిసారించి గ్రామస్తుల ఆకాంక్ష నెరవేర్చాలని కోరుతున్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

ఆత్మకూర్: అపరచిత వ్యక్తుల ఫోన్‌కాల్స్‌కు స్పందించకూడదని, ఓటీపీ తదితర వివరాలను ఇవ్వకూడదని ఎస్ఐ నరేందర్ అన్నారు. బుధవారం ఆత్మకూర్‌లోని పోలీస్‌స్టేషన్ ఎదురుగా వివిధ గ్రామాలకు చెందిన, స్థానికులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. లాటరీ తగిలిందని, ఓటీపీ చెప్పమని, బ్యాంకు నుంచి ఫోన్ చేస్తున్నామని, ఫొటోలను మార్ఫింగ్ చేసి డబ్బులు ఇవ్వాలంటూ భయపెడితే అప్రమత్తంగా ఉండాలని పోలీసులకు ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్ఐలు బీచుపల్లి, రోషన్న, సిబ్బంది యుగంధర్, బాలరాజు, స్థానికులు ఉన్నారు.



ఆలయాల్లో తొలి ఏకాదశి పూజలు



కోటకొండలో స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు



నర్వలో పూజల అనంతరం మంగళహారతి ఇస్తున్న భక్తులు

నారాయణపేట రూరల్: మండలంలోని కోటకొండలో బుధవారం తొలి ఏకాదశి వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. స్థానిక శ్రీ విఠోభా ఆలయంలో భక్తులు పెద్ద సంఖ్యలో శ్రీ రుక్మిణీ సమేత శ్రీపాండురంగస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకుల ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృతాభిషేకం, పుష్పాలంకరణ, మహామంగళహారతి తదితర పూజలు నిర్వహించారు. ఎస్ఎస్‌కే సమాజ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, భజనలు చేపట్టారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో చందులాల్, నారాయణరావు, మోహన్‌లాల్, లక్ష్మినారాయణ, మాణిక్‌రావు, తుల్జారామ్, కిషన్‌రావు, వెంకటేష్, లక్ష్మణ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నర్వ: తొలిఏకాదశిని పురస్కరించుకుని మండలంలోని ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరస్వామి, ఆంజనేయస్వామి, శ్రీరామ ఆలయాల్లో స్వామి వారికి పంచామృతాభిషేకాలు, తులసి అర్చన, విష్ణుసహస్రనామ పారాయణం కార్యక్రమాలను అర్చకులు, భక్తులు చేపట్టారు. అనంతరం భక్తులకు అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా అర్చకులు తొలిఏకాదశి ప్రాశస్త్యాన్ని వివరిస్తూ...ఆషాడమాసంలో వచ్చే తొలి ఏకాదశి రోజున ఒంటిపూటభోజనం చేసి శేషశాయి అయిన లక్ష్మీనారాయణమూర్తిని స్తుతిస్తే కోటిపుణ్యాల ఫలం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో రామకృష్ణ సేవా సమితి సభ్యులు యాదగిరి, నరేష్, ఉపాధ్యాయులు చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా: మండలంలోని గుడెబల్లూర్ లక్ష్మీవెంకటేశ్వర ఆలయం, కృష్ణాలోని వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో బుధవారం తొలిఏకాదశి సందర్భంగా ఆలయ అర్చకులు సుప్రభాతసేవ, అభిషేకం, మహామంగళహారతి పూజాకార్యక్రమాలను భక్తుల సమక్షంలో అంగరంగా వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

మరికల్: మండలంలో తొలి ఏకదాశి వేడుకలను గ్రామస్తులు బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయాలకు వెళ్లి పూజలు చేశారు. ఏకాదశి సందర్భంగా భక్తులు ఉపవాస దీక్షలు చేపట్టారు. ఆలయాల్లో భజన కీర్తనలను ఆలపించారు.

మక్తల్: తొలిఏకాదశిని పురస్కరించుకుని బుధవారం పట్టణంలోని శ్రీమల్లికార్జునస్వామి, శ్రీదమటి ఆంజనేయస్వామి, ఉమామహేశ్వర, శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి భక్తులు అభిషేకం, నిర్వహించి మొక్కుల చెల్లించుకున్నారు. అదేవిధంగా మాద్వార్‌లో శ్రీ లక్ష్మీవెంకటేశ్వర ఆలయంలో పూజలు చేసి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు.

వైభవంగా మొహర్రం



భైరంకొండలో పీర్ల ఊరేగింపు



మరికల్‌లో..



దామరగిద్దలో బొడ్డెమ్మ ఆడుతున్న మహిళలు

నారాయణపేట రూరల్ : మండలంలోని ఆయా గ్రామాల్లో బుధవారం మొహర్రం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం గ్రామ పురవీధుల గుండా సవారీ పీర్లను చక్కగా పూలతో అలంకరించి సాహెబ్ ఖాసీం మోసి శోభాయాత్ర చేపట్టి మసీదుకు తీసుకొచ్చారు. పీర్లను చూసేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. అనంతరం మలీజా వితరణ చేపట్టి మొక్కలు తీర్చుకున్నారు. కులమతాలకు అతీతంగా అలాయ్‌బలాయ్ ఆడుకున్నారు.

మరికల్: మండలంలో ఘనంగా మొహర్రం వేడుకలను జరుపుకున్నారు. ఈ మేరకు.. పీర్లు అలాయ్ బలాయ్ తీసుకున్న తర్వాత మాధవరంలో యువకులు రంగుల దుస్తులను ధరించి ఆడిన అలాయ్, మహిళల బొడ్డెమ్మలు ఆకట్టుకున్నాయి.

దామరగిద్ద: మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే పీర్ల పండగ ఉత్సవాలు బుధవారం మండలంలోని వివిధ గ్రామాల్లో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మండలంతోపాటు కాన్‌కుర్తి, మొగుల్‌మడ్క, మల్‌రెడ్డిపల్లి లోకూర్తి, అన్నాసాగర్, క్యాతన్‌పల్లి తదితర గ్రామాల్లో పీర్ల ఉత్సవాలు నిర్వహించారు. పరుషులు అలైబలై, మహిళల బొడ్డెమ్మలు ఆటపాటలు చూపరులను అలరించాయి.

మక్తల్: మండలంలోని వివిధ గ్రామాల్లో పీర్ల ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామస్తులు, యువకులు పీర్లను ఊరేగించి ఉత్సవంగా నిర్వహించి ప్రత్యేక ప్రార్థనలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. రామకృష్ణారెడ్డి, వహిద్, మునీర్ తదితరులు ఉన్నారు.

మద్దూరు: మండలంలోని నిడ్జింత, మద్దూరు, పల్లెర్ల, దమగ్నపూర్, ఖాజీపూర్, రెనివట్ల, భూనీడ్, కొత్తపల్లి, తదితర గ్రామాల్లో మొహరం సందర్భంగా పీర్లను దర్గాల నుంచి ఊరేగించి నిమర్జనం చేశారు. బుధవారం ఉదయం గ్రామ సచివాలయం వద్ద మండల కేంద్రంలోని అన్ని పీర్లు అలాయ్ బలాయ్ తీసుకున్నాయి. ఈ మేరకు.. మహిళలు బొడ్డేమ్మ, యువకులు అలాయ్ ఆడారు.

ధన్వాడ: మండల కేంద్రంలో పీర్లసవారీ ఉత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో సాయంత్రం గుంతల చుట్టూ డప్పులతో అలాయి ఆడుతూ పెద్దలు, యువకులు చిందులేశారు. అనంతరం పీర్లు సవారికి లేచి గ్రామాల్లో పురవీధుల గుండా ఊరేగింపుగా నిర్వహించారు. అలాగే గోటూర్‌లో రాత్రి డప్పులతో చిందులేస్తూ ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు.



మక్తల్‌లో..



ధన్వాడలో..

ట్రైసైకిళ్లు, ఉపకరణాల పంపిణీ



దివ్యాంగులకు ట్రైసైకిళ్లు పంపిణీ చేస్తున్న మాజీ ప్రజా ప్రతినిధులు

కోస్గి: మండల పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన దివ్యాంగులకు అవసరమైన ఉపకరణాలు కమిట్‌మెంట్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా పంపిణీ చేశారు. ఈ మేరకు స్థానిక ఏబీకే ఫంక్షన్ హాల్‌లో బుధవారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు పాల్గొని దివ్యాంగులకు ట్రై సైకిళ్లను, చెవిటి వారికి చెవి మిషన్లు, దివ్యాంగులకు చేతికర్రలు పంపిణీ చేశారు. దివ్యాంగుల అభివృద్ధికోసం చేయూతనిస్తూ తమ సంస్థ తరపున ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఆ సంస్థ ప్రతినిధులు తెలిపారు. మొత్తం 150మందికి ఉపకరణాలు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ ప్రకాష్‌రెడ్డి, మాజీ ఎంపీపీ మధుకర్‌రావు, టీపీసీసీ మెంబర్‌వార్ల విజయ్‌కుమార్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి, అన్న కిష్టప్ప, బెజ్జు రాములు, తుడుం శ్రీనివాస్, నాగులపల్లి శ్రీనివాస్, ఇద్రీస్, టెంట్ నర్సింహా, సంస్థ ఈడీ ఝున్సీ రాణి, దస్తప్ప, రాధమ్మ, సంస్థ పీఆర్పీలు నారాయణమ్మ, సరిత, దేవమ్మ పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తలకు కనీస వేతనం ఇవ్వాలి



వైద్య సిబ్బందికి వినతిపత్రం అందిస్తున్న ఆశాకార్యకర్తలు

మాగనూర్: ఆశా కార్యకర్తలకు కనీస వేతనం రూ. 18వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ గురువారం ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి వినితపత్రం అందించినట్లు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పి. ఆంజనేయులు తెలిపారు. బుధవారం స్థానిక పీహెచ్‌సీలో రేపటి కార్యక్రమానికి సంబంధించి ఆయా మండలాల ఆశా కార్యకర్తలు పాల్గొంటారని, అనుతి ఇవ్వాలని కోరుతూ.. వైద్య సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. ఆశా కార్యకర్తలకు ఉద్యోగ భద్రత, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించడంతోపాటు కనీస వేతనం అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆశాకార్యకర్తల మండల కార్యదర్శి కృష్ణవేణి, ఆశమ్మ, నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



మక్తల్: ఎదురెదురుగా రెండు కార్లు ఢీకొని ఇద్దరు స్వల్పంగా గాయపడ్డారు. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. హైదరాబాద్ నుంచి కారులో ఇద్దరు భక్తులు మండలంలోని కుర్మపురం వద్ద ఉన్న దత్తాత్రయ దర్శనం కోసం బుధవారం బయలుదేరారు. ఈ క్రమంలో కర్ణాటక నుంచి తండ్రీకొడుకులు ఇద్దరు కారులో కర్ణాటక నుంచి హైదరాబాద్ వెళ్తుండగా కాచ్‌వార్ వద్ద ఎదురెదురుగా ఢీకొనడంతో రెండు కార్లు పల్టీలు కొట్టింది. కారులో ఉన్నవారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. అదేదారి వెంబడి ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ప్రమాదాన్ని గమనించి.. రోడ్డుకు అడ్డంగా ఉన్న రెండు కార్లను తీయించి ట్రాఫిక్ క్లియర్ చేయించారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ముగిసిన క్రికెట్ పోటీలు



ఆత్మకూర్: పట్టణంలోని మినీ స్టేడియంలో ఐదురోజులుగా నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలు బుధవారం ముగిశాయి. మొత్తం 12 జట్లు తలపడగా మినీ స్టేడియం జట్టు మొదటి బహుమతి కైవసం చేసుకోగా.. విరాట్ టీం రెండో బహుమతిని సాధించింది. తహసీల్దార్ నరేందర్, శ్రీనివాస మెడికల్స్ అధినేత చెట్ల శ్రీనివాసులు విజేతకు రూ.5వేలు నగదు, రన్నర్‌కు రూ.3 వేలు నగదు షీల్డులను అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు నగేష్, మహేందర్, రాజేష్, అఫ్రోజ్, శ్రీధర్, క్రీడాకారులు ఉన్నారు.

స్ఫూర్తి ప్రదాత ఏకలవ్యుడు



ఏకలవ్యుడి విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ రూరల్: ఏకలవ్యుడు స్ఫూర్తి ప్రదాత అని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పద్మావతి కాలనీలో నిర్వహించిన ఏకలవ్యుడి జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. గురువు లేకపోయినా అర్జునుడికి సమ ఉజ్జీగా ఏకలవ్యుడు విలువిద్యలో రాణించారని అన్నారు. పట్టుదల కలిగి, మంచి సంకల్పం బలంగా ఉంటే ఏదైనా సాధ్యమేనని ఆనాడే ఆయన చాటి చెప్పారని తెలిపారు. అలాంటి వారిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఉబేదుల్లా కొత్వాల్, సంజీవ్ ముదిరాజ్, వినోద్‌కుమార్, బెక్కరి మధుసూదన్‌రెడ్డి, సత్తూరు చంద్రకుమార్‌గౌడ్, పొన్నకల్ కృష్ణయ్య, ఏకలవ్య సంఘం అధ్యక్షుడు నర్సిములు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా ఏకలవ్యుడి జయంతిని పురస్కరించుకుని పద్మావతి కాలనీలో గల ఆయన విగ్రహానికి ఎంపీ డీకే అరుణ, మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

వానరానికి అంత్యక్రియలు

మక్తల్: మండలంలోని దాసర్‌పల్లి గ్రామ శివారుల్లో రైల్వేస్టేషన్ దగ్గర బుధవారం విద్యుత్ షాక్ తగిలి ఓ వానరం అక్కడికక్కడే మృతిచెందింది. గమనించిన గ్రామస్తులు హిందూ సంప్రదాయం ప్రకారం వానరానికి అంత్యక్రియలు నిర్వహించారు.



శ్మశాన వాటికకు దారేది..

మాగనూర్: అంత్యక్రియలు జరపాలంటే ఆ ఊళ్లో ముప్పుతిప్పలే. వర్షాకాలం వస్తే చాలు పరిస్థితి మరింత దారుణంగా మారుతుందని వాపోతున్నారు. మండల పరిధిలోని తళంకేరిలో శ్మశానవాటికకు వెళ్లేందుకు దారి లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నో సంవత్సరాలుగా ఇబ్బందులు పడుతున్న పట్టించుకున్న నాథుడే లేడని ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి శ్మాశన వాటికకు కావాల్సిన దారిని ఏర్పాటచేసి తమ కష్టాలు తీర్చాలని తళంకేరి గ్రామస్తులు కోరుతున్నారు.

పేదల పెన్నిధి పండగ సాయన్న..



మక్తల్‌లో చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



ధన్వాడలో..

మక్తల్: పట్టణంలోని ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పండగ సాయన్న జయంతిని పురస్కరించుకొని బుధవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ మేరకు.. డాక్టర్ శ్రీరాం మాట్లాడుతూ.. ఆయన ఆశయాలను కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు నర్సింహులు, డాక్టర్ శ్రీరాం, తిరుపతి, కర్నిగోపి, అంజయ్యచారి, కావలి ఆంజనేయులు, రమేష్, పృథ్వీరాజ్, అశోక్, ఆనంద్, ప్రవీణ్, మధు తదితరులు పాల్గొన్నారు.

ఊట్కూరు: మండలంలోని పాత పేట వీధిలో బుధవారం పండగ సాయన్న జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు.. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు రవికుమార్, అశోక్, శివరామరాజు, రాము, పాతింటి లక్ష్మణ్, వసంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ధన్వాడ: పేదల పెన్నిధి పండగల సాయన్న అని మత్స్యపారిశ్రామిక సహకార సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నర్సింహులునాయుడు పేర్కొన్నారు. పండగ సాయన్న జయంతిని పురస్కరించుకుని బుధవారం మండల కేంద్రంలో బస్‌స్టాండ్ వద్ద పండగసాయన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈమేరకు.. వారు మాట్లాడుతూ భూస్వాములు, పెత్తందారుల ఆటకట్టించి అర్ధాకలితో అలమటిస్తున్న నిరుపేదలకు వస్తువులను పంచి పెట్టి ఆకలితీర్చిన మహానీయుడని వారు పేర్కొన్నారు. కులమతాలకతీతంగా అన్ని సామాజిక వర్గాలకు వెన్ను దన్నుగా నిలిచి వారి గుండెల్లో చిరస్మరణీయుడయ్యాడని అన్నారు. కార్యక్రమంలో నర్సింహులు, రామచంద్రయ్య, భాస్కర్, తాజొద్దీన్, అజీముద్దిన్, సుదర్శన్‌గౌడ్, శ్రీనివాసులునాయుడు, రాజు, లక్ష్మయ్య, చంద్రయ్య, రాజు, శివకుమార్, ఆంజనేయులు, విష్ణు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాద వృత్తి ఎంతో పవిత్రమైంది..



న్యాయవాదులను సన్మానిస్తున్న ఎస్పీ బాలుఫ్యాన్స్ సభ్యులు

నారాయణపేట రూరల్: సమాజంలో న్యాయ వ్యవస్థకు ప్రత్యేక స్థానం ఉందని, న్యాయవాద వృత్తి ఎంతో పవిత్రమైందని ఎస్పీ బాలు ఫ్యాన్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి అన్నారు. అంతర్జాతీయ న్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం పట్టణంలోని సీనియర్ న్యాయవాదులు నాగురావునామాజీ, ప్రవీణ్‌కుమార్‌ను శాలువా, జ్ఞాపికతో సన్మానించారు. వారు మాట్లాడుతూ.. సమాజంలో అన్యాయాన్ని ఎదురించి బాధితులకు న్యాయం చేయడానికి తమవంతుగా కృషి చేస్తున్న న్యాయవాదుల కృషి ప్రశంసనీయమన్నారు. బాల కేంద్రానికి అండగా ఉంటూ సంరక్షించిన న్యాయవాదులను అభినందించారు. కార్యక్రమంలో వసంత్‌కుమార్, సంగ నర్సింహులు, రామకృష్ణకళ్యాణి, నాగరాజు పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థికసాయం



నవీన్‌కు ఆర్థికసాయం అందజేస్తున్న ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

కొత్తకోట రూరల్: మండలంలోని వడ్డెవాట గ్రామానికి చెందిన బొగ్గు శ్రీనివాసులు కుమారుడు నవీన్‌కు ఐఐటీలో సీటు సాధించాడు. స్థానిక కాంగ్రెస్ నాయకులు దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డిని చింతకుంట మండలం ధమగ్నాపురం గ్రామంలోని ఆయన నివాసంలో కలిసి నవీన్ కుటుంబ ఆర్థిక పరిస్థితిని వివరించారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే చదువుల ఖర్చు నిమిత్తం రూ.20వేలు ఆర్థికసాయం అందజేశారు. ఆదేవిధంగా వడ్డెవాట మాజీ ఎంపీటీసీ ఉదరి వెంకటన్న కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న విషయాన్ని వివరించగా అతడికి రూ.5వేలు అందజేశారు. గ్రామంలో ఎవరికి ఏ ఆపద వచ్చినా వెంటనే స్పందిస్తున్న ఎమ్మెల్యేకు గ్రామస్తులు, కాంగ్రెస్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. సత్యన్న అనే రైతు ఐదేళ్ల క్రితం మృతి చెందగా.. రైతుబీమా చెక్కు వచ్చే విధంగా కృషి చేస్తానని ఎమ్మెల్యే భరోసానిచ్చారు. కార్యక్రమంలో భానుప్రకాష్‌రెడ్డి, అచ్చిరెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ రాంలాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో 'పేట' భక్తులు



శ్రీవారి మెట్ల పూజలో పాల్గొన్న మహిళలు

నారాయణపేట రూరల్: తిరుమల శ్రీవారి సేవలో పేటకు చెందిన పలువురు భక్తులు పాల్గొన్నారు. పట్టణానికి చెందిన మాజీ మున్సిపల్ వైస్ చైర్మెన్ ఉలిగడ్డ బాలింగం కుమారుడు రాకేష్ కో-ఆర్డినేటర్‌గా వ్యవహరిస్తూ ఆయన ఆధ్వర్యంలో సుమారు 200మంది సేవకులు తిరుపతి తరలివెళ్లారు. అక్కడ ఆషాఢ శుద్ధ ఏకాదశి సందర్భంగా 15మంది వీరశైవ మహిళలు శ్రీవారి మెట్లపూజ కార్యక్రమం చేపట్టారు. అనంతరం స్వామి వారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో లక్ష్మి, పద్మ, ప్రేమలత, ఇందిర, మంజుళ, సరిత, శారద, స్వర్ణలత, హరిత, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

పశువులను బయటకు వదలొద్దు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పట్టణ పరిధిలో కాపరులు పశువులను ఎట్టి పరిస్థితుల్లోనూ బయటకు వదలొద్దని కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో సూచించారు. కొన్ని రోజులుగా జిల్లా కేంద్రంలోని జడ్చర్ల - రాయ చూర్ (ఎన్‌హెచ్- 167) ప్రధాన రహదారిపై ఇవి ఎక్కడబడితే అక్కడ సంచరిస్తూ వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు.